క్లుప్తంగా

రాజన్న సేవలో జిల్లా జడ్జి



జిల్లా జడ్జి నీరజకు పూలమొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న జ్యోతిర్మయి

వేములవాడ: రాజన్నను జిల్లా జడ్జి నీరజ బుధవారం దర్శించుకున్నారు. వేములవాడ సబ్ జడ్జి అజయ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి కిరణ్మయి, ఆలయ ఈవో వినోద్‌లు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు

అడిషనల్ జడ్జి పుష్పలత..

సిరిసిల్ల జిల్లా ఫస్ట్ అడిషనల్ జడ్జి పుష్పలత స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేశారు.

పుష్పగుచ్ఛం అందజేత

వేములవాడ సీనియర్ సివిల్ జడ్జిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన అజయ్‌కుమార్ జాదవ్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, తిరుమలగౌడ్, పెంటరాజు, నాగుల సంపత్‌కుమార్, కనికరపు శ్రీనివాస్, బొజ్జ మహేందర్, రాజూరి రమేశ్, బీమా మహేశ్, పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడరూరల్ : పట్టణ తెలంగాణ గిరిజన బాలికల గురుకుల విద్యార్థులకు ఇంపాక్ట్ ఆధ్వర్యంలో ఉచిత మోటివేషన్ తరగతులు బుధవారం నిర్వహించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ (ఐసీఐ) రీజినల్ ప్రెసిడెంట్ కుతాడి తిరుపతి మాట్లాడారు. విద్యార్థులు వేసవిసెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీఐ రీజినల్ డైరెక్టర్ ఆవుల సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభ, అధ్యాపకురాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో అంగన్‌వాడీకేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి అన్నారు. మండలకేంద్రంలోని స్వశక్తి భవన్‌లో పలు గ్రామాలకు చెందిన గర్భిణులకు బుధవారం సీమంతం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి, పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ రాజు, రమ్య, అన్నిగ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి



వేములవాడరూరల్: వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లి శివారు రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సర్వేనంబర్ 383, 384లో నాంపల్లి రాజయ్యకు చెందిన స్థలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం బుధవారం అధికారులు అక్కడికి వెళ్లారు. విషయం తెలుసుకున్న స్థలం యజమాని కుటుంబసభ్యులు అక్కడికి వచ్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఈ స్థలానికి ఎలాంటి పరిహారం రాలేదని, పరిహారం ఇచ్చిన తర్వాతే స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. దాదాపు రూ.15 లక్షల వరకు నష్టపరిహారం జరుగుతుందని, వెంటనే చెల్లించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంపై బాధితుడి ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఏనుగుల సదయ్య రాచర్లబొప్పాపూర్‌లో తన హార్వెస్టర్‌తో వరికోత పనులకు వచ్చాడు. పనులు ముగించుకొని మంగళవారం తిరిగి పెద్దపల్లికి వెళ్తున్నాడు. ఎల్లారెడ్డిపేట పాతబస్టాండ్ ఏరియాలో కారుతో అతివేగంగా వెనుక నుంచి వచ్చి మేఘరాజ్ అనే వ్యక్తి ఢీకొట్టాడు. బాధితుడి ఫిర్యాదుతో మేఘరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

వేములవాడరూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.శంకర్ అన్నారు. వేములవాడ మండలంలోని డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలకు సంబంధించిన గోడప్రతులను విద్యార్థులు కళాశాలలో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... యువత మత్తుపదార్థాలకు బానిసకావడంతో అవాంఛనీయ ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రసాద్, శకుంతల, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు, యాంటీ డ్రగ్స్ కమిటీ కోఆర్డినేటర్ కరుణ, తదితరులు పాల్గొన్నారు.

‘తడి’ లేదు.. ‘పొడి’ లేదు



రామారావుపల్లెలో కంపోస్ట్ షెడ్ వద్ద పాలిథిన్ కవర్లను కాల్చిన సిబ్బంది



చందుర్తిలో కాలువ పక్కనే డంప్ చేసిన చెత్త

- గ్రామాల్లో వృథాగా కంపోస్ట్ షెడ్లు
- వ్యర్థాలను సేకరించి కాల్చివేత
- కాగితాల్లోనే వర్మీ కంపోస్టు తయారీ
- దృష్టిసారించని అధికారులు

చందుర్తి: గ్రామాలను శుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణను పరిరక్షించేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్ట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ఇళ్లలోని చెత్తను తరలించేందుకు ప్రభుత్వం పంచాయతీకో ట్రాక్టర్‌ను సమకూర్చింది. జనాభా ప్రతిపాదికన ప్రతీనెల నిధులు విడుదల చేస్తోంది. గ్రామాల్లోని వీధుల్లో ట్రాక్టర్‌లో తిప్పుతూ పారిశుధ్య కార్మికులు ఇళ్లలో చెత్తను సేకరిస్తున్నారు. వీధుల్లోనూ, మురుగు కాలువల్లో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర వ్యర్థాలను సేకరిస్తున్నారు. సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాల్సి ప్రజలు ఒకే బుట్టలో వేసి కార్మికులకు ఇస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణ కోసం రెండు డబ్బాలు అందించినా ప్రజలకు అవగాహన లేక తడి, పొడి చెత్తను ఒకే డబ్బాలు కలిపి ఇస్తున్నారు. దీనిపై గ్రామపంచాయతీ అధికారులు దృష్టిసారించకపోవడంతో నిర్వహణ ఇష్టానుసారంగా మారింది.

అవగాహన లోపం

మండలపరిధిలో 19 గ్రామ పంచాయతీలున్నాయి. సుమారు మండలంలో 35 వేలకుపైగా జనాభా ఉంది. ఒకటి, రెండు గ్రామపంచాయతీల్లో మినహాయిస్తే, ఏ గ్రామపంచాయతీ పరిధిలో ఆశించిన మేర సేంద్రియ ఎరువులు తయారీ చేయడం లేదు. కంపోస్ట్ షెడ్‌లు, డంపింగ్ యార్డుల నిర్మాణాలు పూర్తిచేశారు. కాగా కొన్ని గ్రామాల్లో రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో షెడ్లు దూరంగా ఉన్నాయి. అక్కడికి వెళ్లేందుకు దారికూడా సక్రమంగా లేదు. అంతదూరం వెళ్లలేక పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడో ఓ చోట పారబోస్తున్నారు. కొందరు సమీపంలో ఉన్న ఒర్రెల్లో, మరికొందరు రోడ్డువెంట చెత్కు నిప్పు పెడుతున్నారు. దీంతో పర్యావరణ దెబ్బతింటుంది. దీంతో రోడ్డువెంట ప్రయాణికులు పొగతో ఇబ్బంది పడుతున్నారు.

కాగితాల్లోనే లెక్కలు

గ్రామాల్లో చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్లకు ఏటా సుమారు రూ.8.75 లక్షల డీజిల్ ఖర్చులే అవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కంపోస్ట్‌షెడ్ల వినియోగంతో ఆశించిన మేర సేంద్రియ ఎరువును తయారు చేస్తే గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని భావించినా ప్రభుత్వ అంచనాలు తారుమారవుతున్నాయి. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలతో వర్మీ కంపోస్టు ఎరువును ఏడాదిలో రెండుసార్లైనా తీసిన గ్రామపంచాయతీలు కూడా లేవు. కానీ మండల స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు మాత్రం కంపోస్టు షెడ్లలో తయారీ చేసిన సేంద్రియ ఎరువును హరితహారంలో వినియోగిస్తున్నామంటూ కాగితాల్లో నివేదికలు తయారు చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెత్తకు నిప్పు పెడుతున్నారు



గ్రామంలోని చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకొచ్చి ఇళ్ల సమీపంలో పారబోస్తున్నారు. దీంతోపాటు చెత్తకు తరుచూ నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ వ్యాపిస్తుండటంతో ఇబ్బంది పడుతున్నాం. వ్యర్థాల వాసనతో పాటు దోమలబెడద ఎక్కువవుతోంది.

– మర్రి రాజు, చందుర్తి

సజావుగా చెత్త సేకరణ



గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ సజావుగా సాగుతుంది. తడి, పొడి చెత్త సేకరణకు ప్రజలు సహకరించడం లేదు. గ్రామస్థాయిలో ప్రజలకు మరోసారి అవగాహన కల్పించాలి. చెత్త సేకరణలో లభ్యమైన తునికాకు వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. ఇతరవ్యర్థాలు లేకపోవడంతో తునికాకు తయారీకి వినియోగమవుతోంది.

– బండి ప్రదీప్‌కుమార్, ఎంపీవో, చందుర్తి



బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్

జిల్లా కేంద్రంలోని చంద్రంపేట బైపాస్ ఎక్స్ రోడ్డులో మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అమర్చారు. సిరిసిల్ల నుంచి చంద్రంపేట మీదుగా కోనరావుపేట, నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రాలకు వెళ్లే వాహనాలు ఈ రోడ్డు గుండా వెళ్తుంటాయి. మరోవైపు రగుడు నుంచి వెంకటాపూర్ వరకు బైపాస్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ పూర్తయింది. చంద్రంపేట వద్ద ప్రమాదకరంగా ఎక్స్‌రోడ్డు ఉండగా ఇక్కడ వాహనాలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. చంద్రంపేట బైపాస్ ఎక్స్‌రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్ అమర్చాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో చంద్రంపేట బైపాస్ ఎక్స్‌రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్ అమర్చారు. వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తే.. రోడ్డు ప్రమాదాలను నివారించినట్లు అవుతుంది. రగుడు కలెక్టరేట్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంటాపూర్ వరకు ఉన్న రెండో బైపాస్ రోడ్డులో చంద్రంపేట వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. మరిన్ని చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– సిరిసిల్ల

వంతెన పనులు త్వరగా పూర్తిచేయాలి



ఎమ్మెల్యే సత్యంకు వినతిపత్రం ఇస్తున్న స్తంభంపల్లి గ్రామస్తులు

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి గంజివాగు లోలెవల్ కల్వర్టు స్థానంలో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఏడాదిగా బ్రిడ్జి పనులు జరుగకపోవడంతో ప్ర యాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి వెంకటేశ్, అక్కెనపెల్లి రాజయ్య, బీరవెల్లి మురళి, ఎడపెల్లి కిషన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, ఎర్రం రమేశ్, కాంతయ్యరెడ్డి, వెంకటరమణ, అమర్, దేవరాజు, శ్రీనివాస్, బాబు తదితరులు ఉన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కోనరావుపేట : మంగళ్లపల్లిలో సమావేశం నిర్వహించిన ఉపాధ్యాయులు

బోయినపల్లి: వేసవిలో సెలవుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే వేసవి శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని విలాసాగర్ హైస్కూల్ హెడ్ మాస్టర్ బొలగం శ్రీనివాస్ కోరారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిబిరాల పేరిట ప్రభుత్వం పాఠశాల ఆవరణలో కంప్యూటర్ శిక్షణతో పాటు, క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసిందని తల్లిదండ్రులు దృష్టి సారించాలని కోరారు. ఉపాధ్యాయులు మాదిరెడ్డి రాజిరెడ్డి, శోభారాణి, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, ఎండీ.షఫియొద్దిన్ తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, నిజామాబాద్, మంగళ్లపల్లి పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రగతిపత్రాలను తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. ఆయా పాఠశాలల్లో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు షాబొద్దీన్, నర్సయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంగ, ఉపాధ్యాయులు మధు, శ్రీనివాస్, పద్మ, శేఖర్, భూమేశ్, విద్యారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: గ్రామంలోని బడీడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని ప్రధానోపాధ్యాయురాలు రేవతి అన్నారు. రేపాక జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలి



సిరిసిల్ల టౌన్ : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు



వీర్నపల్లి : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదామని పలువురు కోరారు. సిరిసిల్లలోని సీఐటీయూ, ఏఐటీయూసీ కార్యాలయాల్లో బుధవారం యూనియన్ల ఆధ్వర్యంలో మే డే పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు కడారి రాములు, అజ్జ వేణు, మీసం లక్ష్మణ్, ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం ర మణ, అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడి హక్కులు సాధిద్దాం

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలు చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పంతం రవి, మీసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అరుణ్ కుమార్ అన్నారు. కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ.. మేడే సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు హాజరుకానున్నారన్నారు. భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకట్, నాయకులు రాజెల్లయ్య, నరేందర్, దేవయ్య పంచాయతీ కార్మికులు నర్స య్య, వినిత్, నాగేష్, హమాలీ సంఘం నాయకుడు రాజేశం, పాల్గొన్నారు.

జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



సిరిసిల్ల: జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తపెల్లి(దుర్గా) శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బోడ రవీందర్, కోశాధికారిగా ఆర్.శ్రీనివాస్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కెమిస్ట్ భవనంలో బుధవారం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎనకైనట్లు ఎన్నికల అధికారి చెక్కిళ్ల మహేశ్‌గౌడ్ ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు అరవింద్, నర్సయ్య వ్యవహరించారు. సీనియర్ కెమిస్ట్‌లు చేపూరి రాజేశం, చేపూరి బుచ్చయ్య, కనక రాజేశం, దేవదాస్ పాల్గొన్నారు.

‘అంబేడ్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దే’

సిరిసిల్లటౌన్: డా. బీఆర్ అంబేడ్కర్‌ను ఆది నుంచి అవమానించిన చరిత్రను కాంగ్రెస్ పార్టీ మూటగట్టుకుందని బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ విమర్శించారు. బుధవారం బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా జిల్లా సదస్సు (సెమినార్) అవగాహన కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ దళిత మోర్చా కార్యదర్శి ఎస్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప హాజరయ్యారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనా విధానాన్ని బలపరిచిన అంబేడ్కర్‌కి, ఆయన ఆలోచనలకు ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వం తగిన గౌరవం ఇస్తోందన్నారు. అంబేడ్కర్‌కు భారతరత్న కోసం బీజేపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్ర మహేశ్, సెస్‌మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మ్యాన రాంప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, నాయకులు కరెడ్ల మల్లారెడ్డి, మరుత సత్తయ్య, బర్కం నవీన్ యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు శ్రీ నాగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అబ్జర్వర్లుగా జిల్లా నేతలు

సిరిసిల్లటౌన్: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకులను ఆ పార్టీ బుధవారం పలువురిని నియమించింది. రాష్ట్ర జాబితాలో జిల్లా నాయకులు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, పీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ పేర్లు ఖరారయ్యాయి. జిల్లాకు చెందిన అజ్మతుల్లా హుస్సేనీ, సంగీతం శ్రీనివాస్‌లకు పెద్దపల్లి జిల్లా అబ్జర్వర్లుగా, కామారెడ్డి అబ్జర్వర్‌గా నాగుల సత్యనారాయణగౌడ్‌కు బాధ్యతలు అప్పగించింది.


ధాన్యం దించుకోవడంలో ఆలస్యంపై ధర్నా



గోదాముల వద్ద బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా

ముస్తాబాద్: ధాన్యం దించుకోవడంలో జాప్యాన్ని నిరసిస్తూ మండలంలోని నామాపూర్ గోదాముల వద్ద బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ గోదాముల వద్ద హమాలీలు లేరన్నారు. నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో ధాన్యంతో వచ్చిన వాహనాలు ఉన్నాయన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గోదాము ఇన్‌చార్జి చిట్టిబాబు మాట్లాడుతూ నామాపూర్ గోదాములకు పెద్దపల్లి హమాలీలు రావాల్సి ఉందని, వారు రాకపోవడంతో లారీలు నిలిచిపోయాయని తెలిపారు. బీఆర్‌ఎస్‌పై మండలాధ్యక్షుడు శీలం స్వామి, మెంగని మనోహర్, జహంగీర్ పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసం తనిఖీ



తంగళ్లపల్లి : రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్ తనిఖీ చేశారు. తంగళ్లపల్లి మండల పరిషత్‌లో అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ, సూపరింటిండెంట్ డి.రమేశ్, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ తదితరలు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన వ్యక్తికి ఏడాది జైలు

సిరిసిల్లకల్చరల్: అదనపు కట్నం కోసం వేధించిన ఓ వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఏ. ప్రవీణ్ బుధవారం తీర్పు నిచ్చారు. టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణంలోని సిద్దులవాడకు చెందిన కర్నాబత్తుల పద్మావతికి 31ఏళ్లక్రితం ప్రేమ్‌సాగర్ రావుతో వివాహం జరిగింది. ఏఈఈగా విధులు నిర్వహిస్తూ సస్పెన్షన్‌కు గురైన ప్రేమ్‌సాగర్‌రావు మద్యానికి బానిసయ్యాడు. 2017 జనవరి 27న డబ్బులు డిమాండ్ చేస్తూ తనను తిడుతూ తీవ్రంగా కొట్టాడని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు జరిపిన విచారణ అధికారి లియాఖత్ అలీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. పీపీ చెలుముల సందీప్ ప్రాసిక్యూషన్ తరఫున కేసు వాదించాడు. ఆరుగురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి ప్రేమ్‌సాగర్‌రావుకు ఏడాది జైలుతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి



సిరిసిల్ల టౌన్: కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న జిల్లా ఐఎంఏ అసోసియేషన్ ప్రతినిధులు



సిరిసిల్ల టౌన్ : బీజేపీ ఆధ్వర్యంలో..



గంభీరావుపేటలో...

సిరిసిల్లటౌన్: పహల్గాం మృతులకు జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు నివాళి అర్పించారు. బుధవారం రాత్రి జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో మృతులకు సంతాపం ప్రకటించి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అభినయ్, ఉపాధ్యక్షుడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నేతలు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి నవీన్ యాదవ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అల్లం అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మండలకేంద్రంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

బోయినపల్లి: కాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రదాడిలో మృతిచెందినవారికి సంతాప సూచకంగా నివాళి అర్పిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపెల్లి పర్శరాం ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు.

ముస్తాబాద్: బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహంవద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

ఇల్లంతకుంట: బీజేపీ మండల కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మండలకేంద్రంలోని వివేకానంద చౌరస్తా నుంచి బస్టాండ్ గాంధీవరకు కొవ్వొత్తుల ర్యాలీతీశారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలో బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

• విప్‌ను కలిసిన నాయకులు

ఇల్లంతకుంట: మండలంలోని మహనీయుల జయంత్యుత్సవ సభ కమిటీ నాయకులు బుధవారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. ఈనెల 30న దళిత బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మహనీయుల జయంత్యుత్సవ సభకు రావాలని విప్‌ను ఆహ్వానించారు. కమిటీ కన్వీనర్ సావనపెల్లి రాకేశ్, శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

వీర్నపల్లి: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలల్లో తనిఖీ చేశారు. గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలు, క్యాలెండర్లను హెచ్‌ఎం వెంగల శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లాస్య, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేష్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ప్రధాన రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

చందుర్తి: ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారకులు కావద్దని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబోయడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే చందుర్తి–మోత్కురావుపేట గ్రామాల ప్రధాన రహదారిపై ధాన్యం కుప్పలు పోయడంతో నాలుగు ప్రమాదాలు జరిగాయన్నారు. రైతులు కొయ్యకాలుకు నిప్పుపెట్టడంతో పర్యావరణంతో పాటు భూసారం దెబ్బతింటుందని సీఐ తెలిపారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రుద్రంగి: అకాలవర్షం..తడిసిన ధాన్యం అనే శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ధాన్యం కొనుగోళ్లు, మిల్లులకు తరలించడంలో జాప్యంలేకుండా కొనుగోళ్ల వేగవంతం చేయాలని,ధాన్యం తడవకుండా టార్పాలిన్‌కవర్లు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

గర్జనపల్లిలో ముందస్తు బడిబాట

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట నిర్వహించారు. గర్జనపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంగల శ్రీనివాస్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గూగులోత్ తిరుపతి జాదవ్ కావేరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం మిల్లులకు తరలిస్తున్నాం

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఏర్పాటు చేసిన 17 ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిలుల్లకు తరలిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం మల్లేశం తెలిపారు. బండలింగంపల్లిలో బుధవారం తూకం వేసిన ధాన్యాన్ని సమీప రైస్ మిల్లులకు తరలించారు.